క్లుప్తంగా

మధుమేహ వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత డయాబిటిక్ క్యాంపుకు అనుహ్య స్పందన లభించింది. ప్రధాన రహదారిలోని గుంతా రమేష్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన శిబరంలో దాదపు 200 మందికి పైగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అంతేకాకుండా బీపీ, షుగర్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో క్యాంప్ చైర్మన్ వేల్పూరి రవి, అధ్యక్షుడు కోటేశ్వరప్రసాద్, కోశాధికారి గుంతా రమేష్‌బాబు, సభ్యులు గోపా జగదీష్, దినేష్, సుదర్శన్‌బాబు, బాలాజీ, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతి



రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ఆదివారం దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ 139వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజేంద్రప్రసాద్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, రామ్మోహన్, అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు, ఉపాధ్యక్షులు ఫకృద్దీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలకు పేర్లు నమోదు చేసుకోండి

గుంతకల్లుటౌన్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఏటా మాదిరిగానే దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేయనున్న కృత్రిమ అవయవాలకు నెల 9వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ మేరకు నగర ఉత్సవ సమితి కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పేర్లను నమోదు చేసుకున్న వారికి ఈ నెల 10వ తేదీన వీహెచ్‌పీ అమృతవర్షిణీ బాలకళ్యాణ ఆశ్రమంలో కొలతలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. శాశ్వత దాత భాస్కర్‌రంగయ్య–98496 99992, లక్ష్మీనారాయణ–94925 83346 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఖురాన్‌ను నిత్యం పఠించాలి



బహుమతులను సాధించిన విద్యార్థినులతో నిర్వాహకులు

తాడిపత్రి అర్బన్: ముస్లిం చిన్నారులు పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను నిత్యం పఠించాలని జమాతియా ఇస్లామ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. యాసిర్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పద్మవాణి హైస్కూల్‌లో యునైటెడ్ ఫోరం ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఖురాన్ సూరాల క్వార్టర్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఇందులో చిన్నారులను 4 గ్రూపులుగా విభజించి ఖురాన్‌లోని సురాలను చదివించారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగపీరయ్య, పట్టణ సర్కార్ ఖాజీ హాయాద్‌బాషా ఖాద్రీ, దూదేకుల సంఘం గౌరవాధ్యక్షులు నబిరసూల్, మౌలానా అబ్దుల్, జహీర్‌సాహెబ్, హబీబ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ ప్రసాద్

శింగనమల: ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలకు అవకాశం కల్పిస్తోందని ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దాదాపు 90 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 51 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారికి మంగళవారం కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆశాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టండి



గుంతకల్లు మండలం కసాపురంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి



యాడికిలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బాలమ్మ



గార్లదిన్నె మండలం కోటంకలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉషారాణి

గుంతకల్లు రూరల్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి బీఎల్వోలకు సూచించారు. కసాపురం, దోసలుడుకి గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన బీఎల్వోలతో మాట్లాడి దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను ఏరోజు కారోజు నమోదు చేయాలని సూచించారు. వీఆర్వో పవన్‌కుమార్ తదితరులు ఆయన వెంటున్నారు.

గుంతకల్లు: ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా దాదపు 6073 ఓటర్ల వివరాలు (ఫోటోలు, అడ్రస్) ఒకే విధంగా ఉండడంతో వాటిని సవరణ చేయాడానికి ఆయా ఓటర్లకు రిజిస్టర్ పోస్టల ద్వారా సమాచారం పంపామన్నారు. వీరు పోస్ట్ అందిన 15 రోజుల్లోపు ఓటును ఏ పోలింగ్ బూత్‌లో కొనసాగించాలో తెలియజేస్తూ ఈ ఫారంలో టిక్ కొట్టి తమకు అందజేయాలని సూచించారు. అంతలోపు ఓటర్లు స్పందించకపోతే సంబంధిత బీఎల్ఓ వారి ఇంటి వద్దకు వెళ్లి వారి వివరాలను తెలియజేసి తరువాత నిర్ణయం తీసుకుంటారన్నారు. గుంతకల్లు నియోజకర్గంలో దాదాపు 6500పైగా మరణించిన వారి పేర్లును తొలగించామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ బి.రాము పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు 81 దరఖాస్తులు

యాడికి: మండలంలోని 55 పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 81 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బాలమ్మ తెలిపారు. రెండో రోజు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ చేసి బీఎల్వోలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫారం–6కు 52 మంది, ఫారం–7కు 13 మంది, ఫారం–8కు 16 దరఖాస్తులు వచ్చాయని బాలమ్మ తెలిపారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తహసీల్దార్ తెలిపారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు తహసీల్దార్ నాగభూషణం పెద్దవడుగూరులోని పోలింగ్ బూత్‌లోబీఎల్ఓలు అర్జీలు స్వీకరిస్తున్న తీరును గమనించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మండలంలో ఫారం6కు 77, ఫారం7– 12, ఫారం 8–4 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్‌లో ఆదివారం ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 50 పోలింగ్ స్టేషన్లలో 48 మంది కొత్తగా ఓటరు నమోదుకు, 24 మంది ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలని, 17 మంది ఓటరు జాబితా సవరణ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



కల్నల్ రోడ్రిగ్జ్ సమక్షంలో బ్యానర్‌ను అందిస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని 6వ బెటాలియన్ కల్నల్ డీఎల్‌డి రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. ఆదివారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ర్యాంకింగ్ 2023- వేడుకలు ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి కల్నల్ ఎల్‌డి రోడ్రిగ్జ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు రోజూ యోగా, వ్యాయామం తప్పకుండా చేయాలన్నారు. ఏటా ఎన్‌సీసీ క్యాడెట్లకు వారు తీసుకున్న బాధ్యతను బట్టి ర్యాంకులను ఇస్తామని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సుమిత పేర్కొన్నారు. వివిధ ర్యాంకులు క్యాడెట్ సీనియర్ అండర్ ఆఫీసర్ క్యాడెట్ అండర్ ఆఫీసర్ సార్జెంట్, క్వార్టర్ మాస్టర్, కార్పోరల్ లాన్స్ కార్పోరల్ ఇస్తామన్నారు. అనంతరం 23 బ్యాచ్‌కు చెందిన సీనియర్ అండర్ ఆఫీసర్, ఆఫీసర్లు 24 బ్యాచ్ సీనియర్ అండర్, ఆఫీసర్లకు బ్యానర్లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సకలాంగులకు తీసిపోరు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పామిడి: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో దివ్యాంగులు సకలాంగులకు ఏ మాత్రం తీసిపోరని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి అన్నారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో జరిగిన పామిడి విశాల ఫెర్రర్ దివ్యాంగ మండల సమాఖ్య సమావేశానికి తహసీల్దార్‌తోపాటు సీఐ రాజశేఖరరెడ్డి హాజరై మాట్లాడారు. దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగత్వం కేవలం శరీరానికే కాని మనసుకు కాదన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు లబ్ధి చేకూర్చే 2016 చట్టాన్ని అమలు చేయాలంటూ వారు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం ప్రసన్న, గుంతకల్లు లింగమూర్తి, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీటీ మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ పోటీలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

బుక్కరాయసముద్రం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్డీటీ అండర్–11 మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ జోనల్ క్లబ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బీకేఎస్, కడవకల్లు, కళ్యాణదుర్గం, అనంతపురం, నార్పల, క్లబ్‌ల జట్లు తలపడ్డాయి. ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ వంశీకృష్ణ, ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, ఏపీ చౌటప్పల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ఆర్డీటీ సంస్థ ఎంతో కృషి చేస్తోందన్నారు. పోటీల్లో బీకేఎస్ క్లబ్ అన్ని మ్యాచ్‌లు గెలుపొందింది ఈనెల 9, 10 తేదీల్లో ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో జరగబోయే సెంట్రల్ సెవల్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. క్రీడాకారులకు పాఠశాల పీడీ గోపాల్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సింహాద్రి, శివ, షాకీర్, మహేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

పెద్దపప్పూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఆధిపత్యం కోసం ఎవరైనా సమస్యలను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పెత్తనం పెంచుకోవడం కోసం వర్గాలను ఏర్పాటు చేసుకుని గొడవలు పెట్టుకొంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకువాలని సూచించారు.

గీతా పఠనంతో మానసిక ప్రశాంతత

అనంతపురం కల్చరల్: భగవద్గీత సకల సమస్యలకు పరిష్కార మార్గం. గీతా పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి తరపున ఆదివారం నగరంతో పాటూ పలు గ్రామాల్లో గీతా ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు. జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ధర్మాల స్థాపనపై వివరించారు. త్రైత సిద్ధాంతం గీతకు, ముఖ్యంగా పురుషోత్తమ ప్రాప్తియోగంలోని శ్లోకాలకు చెప్పిన భాష్యాలను తెలిపారు. కార్తీక దీపం అందించే ఆరోగ్య రహస్యాల విశిష్టతను వివరించినట్టు జ్ఞానవేదిక సభ్యులు పేర్కొన్నారు. జ్ఞాన వేదిక సభ్యులు పక్కీరప్ప, నీలావతి, జాహ్నవి, విజయక్క, నాగమణి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బలిజల కార్తీక వన భోజనాలు



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘం నాయకులు



ఆనంద తాండవం నాట్యం చేస్తున్న చిన్నారులు

గుత్తి: బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం కార్తీక వన భోజన కార్యక్రమాన్ని ఉత్సాహంగా సాగింది. సంఘం రాష్ట్ర నాయకులు నరహరి, జిల్లా, నియోజకవర్గం నాయకులు బండి సత్య, పులికొండ, నాగయ్య,కపట్రాళ్ల సురేష్, పాటిల్ సురేష్, పగడాల శ్రీనివాసులు, ఆముదాల గిరిధర్, రమేష్, యుగంధర్, నాగరంగప్రసాద్ ఆధ్వర్యంలో బలిజ సంఘం సభ్యులు, కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద నుంచి అప్పయ్యస్వామి ఆలయం వరకు తిరిగి అక్కడి నుంచి సునామ జకినీ మాత ఆలయం వరకు ర్యాలీ సాగింది. ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. సునామ జకినీ మాత ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ బలిజ ఐక్యంగా ఉండాలని, రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆనంద తాండవం నాట్యం చేసి అందరినీ అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కార్తీక వన భోజనాలను నిర్వహించారు. బలిజ సంఘం నాయకులు శ్రీకరం వెంకటేష్, అరుణ్ రాయల్, శ్రీకరం హరి, రమేష్ బాబు, శ్రీకరం గోవిందు, గురు, అనిల్, శ్రీకరం రవి, సున్నా రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృత్యుఘోష

- అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలో నాలుగేళ్లలో 81 మంది బలవన్మరణం
- ప్రమాదాలకు గురై మరో 44 మంది మృత్యువాత
- ఆర్థిక, అనారోగ్య సమస్యలే ప్రధాన కారణం

నాలుగేళ్ల రికార్డుల ప్రకారం..

సంవత్సరం	ఆత్మహత్యలు	ప్రమాదాలు	మొత్తం
2020	15	11	26
2021	33	10	43
2022	13	16	29
2023	20	07	27
మొత్తం	81	44	125

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలో ఆత్మహత్యలు అంతకంతకూ పెరుగుతున్నాయి. రైల్వే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా తక్కువేం ఉండట్లేదు. నాలుగేళ్లలో మొత్తం 125 మంది మరణించారు. అందులో 81 మంది గూడ్స్, రైళ్ల కింద దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు రికార్డుల ప్రకారం తెలుస్తోంది. మరో 44 మంది ప్రమాదశాత్తు గూడ్స్, రైళ్లు కింద పడి మరణించినట్లు స్పష్టమవుతోంది.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలు

దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు పోలీస్ రికార్డుల స్పష్టమవుతోంది. దీనికి పేదరికం కూడా ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఆర్థిక సమస్యలతో మెరుగైన వైద్యం చేయించుకోలేక, కుటుంబ సభ్యులకు భారం కాలేక.. రైళ్ల కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోందని రైల్వే పోలీసులు చెబుతున్నారు.

సకాలంలో స్పందిస్తూ.. ప్రాణాలు కాపాడుతూ..

తమకు ఎదురైన సమస్యలను చూసి కుంగిపోవడం, ఆత్మహత్యలే శరణ్యంగా భావించి రైలు కింద దూరి తనువు చాలించాలనుకుని గూడ్స్, రైళ్లు వచ్చే సమయానికి పట్టాలపైకి చేరుకునే వారిలో కొందరిని రైల్వే పోలీసులు కాపాడుతున్నారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి రైల్వే పోలీసులు రక్షిస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఆ విధంగా ఒక్కో ఏడాదిలో కనీసం 10 మందిని పోలీసులు సకాలంలో రక్షించిన ఘటనలు ఉన్నాయి. అటువంటి వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడం, వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించారు.

యుక్త వయస్సు వారే అధికం



2022 సంవత్సరంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 20–40 ఏళ్ల వయస్సు వారే ఎక్కువగా ఉన్నారు. 2023లో 40–60 ఏళ్లలోపు వారు అత్యధికంగా బలవన్మరణానికి ఒడిగట్టారు. తమకొచ్చిన చిన్న చిన్న సమస్యలను సైతం పరిష్కరించుకునే ఆలోచన లేక.. చాలా మంది గూడ్స్, రైళ్ల కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు మా విచారణలో తేలింది. – విజయకుమార్, జీఆర్పీ ఎస్ఐ, అనంతపురం

ఆత్మహత్య పరిష్కారం కాదు



అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైంది. సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదు. ఆత్మహత్య చేసుకుంటే అప్పటి వరకు తమపై ఆధారపడ్డ భార్యాబిడ్డలు, వృద్ధ తల్లిదండ్రులు ఏమై పోతారో అని ఆలోచించకపోవడం దురదృష్టకరం. ఈ విషయంపై చైతన్యం తీసుకువచ్చే దిశగా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విరివిగా సదస్సులు నిర్వహిస్తున్నాం. జీవితంపై విరక్తి చెందిన వారిని, సమస్యలతో కుంగిపోయే వారిని సకాలంలో గుర్తించేది కుటుంబ సభ్యులే. అటువంటి వారికి ధైర్యం చెప్పాలి. – డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంల అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజవర్గంలోని మొత్తం 276 పోలింగ్ కేంద్రాల వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అవగాహన కల్పిస్తామన్నారు. దీనికి కోసం ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బీ.రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



భోజనం వడ్డిస్తున్న మంజునాథ్‌రెడ్డి తదితరులు

పామిడి: పట్టణంలోని జెండాకట్ట వద్ద ఆదివారం జెండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పేదల గ్యార్మీ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెలరోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా ముగింపు రోజున గ్యార్మీ పండుగను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నేత, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీబీ మంజునాథ్‌రెడ్డి హాజరయ్యారు. జెండా కట్ట వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పేదల గ్యార్మీ పండుగను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవ రెడ్డి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, అనుంపల్లి సూరి, అన్వర్‌ఖాన్, రజాక్‌వలి, అబుసాలేహా, షాషావలి, మహేశ్వర్‌రెడ్డి, డీలర్ రమణ, గోపాల్, జెండా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీలో ఇంటెలిజెన్స్ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఇంటర్ విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ ఇంటెలిజెన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఏటా ఇంటెలిజెన్స్ టెస్ట్ నిర్వహిస్తోందన్నారు. పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం, మడకశిర, గుత్తి, పెనుకొండ, హిందూపురం తదితర ప్రాంతాల నుంచి ఇంటర్ ఎంపీసీ చదువుతున్న 2500 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి సందర్భంగా విజేతలకు మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా ట్యాబ్లెట్, తృతీయ బహుమతిగా మొబైల్ ఫోన్, మరిన్ని ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

కార్తీక మాస ప్రాముఖ్యతపై ప్రచారం



శింగనమలలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

శింగనమల: శింగనమలలో ఆదివారం తాడిపత్రి త్రైత సిద్ధాంతం ప్రచారకర్తలు కార్తీక మాసం ప్రాముఖ్యతపై ప్రచారం నిర్వహించారు. కార్తీక మాసంలో ఆలయాల్లోని ధ్వజస్తంభంపైన దీపం వెలిగించాలన్నారు. ధ్వజ స్తంభం నుంచి గర్భగుడిలోని భగవంతుని వరకు దైవ రాజ్యమే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు బాలయ్య, సభ్యులు ఉదయ్, వీరయ్య, సురేష్, రామానంద, నాయుడు, రామకృష్ణ, రాంమోహన్, హనుమంతు, శ్రీదేవి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఆదివారం రాత్రిలక్ష దీపోత్సవం నేత్ర పర్వంగా సాగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రధాన అర్చకుడు రామాచార్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమానికి వేలాదిగా మహిళలు, భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు భక్తులకు ఎలాంటి అసౌకార్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సాయంత్రం నుంచి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం భజన పోటీలు నిర్వహించారు.

శింగనమల: స్థానిక ఆత్మరామాలయంలో ఆదివారం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. రామాలయం ధ్వజస్తంభం ముందు మహిళలు కార్తీక దీపాలు వెలగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలగించిన మహిళలు



శింగనమల రామాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు